# అద్దంలో జిన్నా

✽

= శ్రీ బాలగంగాధర తిలక్ =

యం. యే. జిన్నా కోటు తొడుక్కుని అద్దంముందు నుంచున్నాడు. అద్దంలో జిన్నా కనపడ్డాడు. అద్దంలో చాలా గొప్ప జిన్నాలా కనపడ్డాడు. అద్దంలో నిజానికి ఒక్క జిన్నా ఒక్కడే కనపడలేదు. జిన్నా వెనుకాల ఎంతమందో వరుసలుతీరి మహమ్మదీయులు 'జిన్నాకీ జై' అంటూ నిలబడ్డారు. అందరిలోనూ ఒక్కొక్క జిన్నా ఉన్నాడు. ప్రతీ మహమ్మదీయుడూ ఒక అద్దం. అద్దంలో జిన్నా అంటే విశాలమూ, వివిధమూ అయిపోయిన జిన్నా. వెడల్పూ, పొడుగూ, మరీ రహస్యమూ మరీ ప్రకటితమూ అయిపోయిన జిన్నా.

జిన్నా చాలా గొప్పవాడు. కోటుగుండీలు పెట్టుకుంటున్నాడు. 'పోర్టికో'లో కారు ఆగింది. ఆ కారుమీద జిన్నా తన గృహఆవరణం దాటి వీథిలోకి వెళుతాడు. పత్రికావిలేఖరులూ, భక్తులూ, రాజకీయవేత్తలూ పోర్టికో స్తంభాల్ని ఆనుకుని నుంచున్నారు. ఆతృతతో, నమ్రతతో నుంచున్నారు. తన్ను దర్శించటానికి వచ్చారు. అవి రంజాన్ రోజులు కాబట్టి! తన్ను దర్శించటంలో ఒక మహత్తు ఉంది. ఒక జగత్తు వుంది. తాను కోటుగుండీలు పెట్టుకునే ఒక సామాన్యప్రాణి కాడు. తాను వారిలో అవ్యక్తంగా ఉన్న ఒక కోర్కె! తన వ్యక్తతలో వాళ్లందరూ మడతలుపడిపోయిన ఒక పెద్ద అవ్యక్తత.

తానొక రూపం కాదు. ఒక చిత్రం కాదు. ఒక విచిత్రం కాదు. తానొక పెద్ద మనస్సు! తానొక పెద్ద భావం! మనస్సు కండరాలకన్నా, కోటుగుండీలకన్నా చాలా పెద్దది. గొప్పది. ఆ మనస్సు తనలో వుంది. ఆమనస్సు తనలో పెద్ద కాంతిలా వుంది. ఆ మనస్సు పరమాణువులా తనలో వుంది. ఆ పరమాణువు తనచుట్టూ వలయాలు కల్పించుకుంటూ శక్తినీ, కదలికనీ ప్రేరేపిస్తుంది. ఆ కదలికలో కోటి మనస్సులలో వుండే కోటిపరమాణువుల్ని తాకుతుంది. తన మనస్సు రథికుడు. ఆ మనస్సు సృష్టించిన భావం ఒక రథం. ఆ రథం తను నడిపిస్తున్నాడు. మహమ్మదీయులందరూ ఆ రథచక్రాలకి కట్టుబడ్డారు. ఆ రథం అతివేగంతో నడుస్తుంది. వేగం ఆ రథంతో నడవలేదు. పంజాబ్, సింధ్, బెలూచిస్థాన్, బెంగాల్, అస్సామ్ భూములమీద ఆ రథం నడుస్తుంది. ఆ చప్పుడుకి కాబూలుకైబరుకనుమలు ప్రతిధ్వనిస్తాయి. కైలాసంమీద మహేశ్వరుడికి బదులుగా 'అల్లా'ని తాను నిలబెట్టుతాడు; ప్రతిష్ఠిస్తాడు. ఆ రథం వెనుకాల మహమ్మదీయు లందరూ వస్తారు. ఎందుకు వస్తారో వారికి తెలియదు. తెలుసుకుంటే ఎవరూ ఏవిషయంలో ఏమీ చెయ్యరు. అజ్ఞానం క్రియకీ, కర్మకీ కారణం. జ్ఞానం నిదానానికీ, సమాధికీ కారణం. ఆ అజ్ఞానాన్ని తాను కాపాడుతాడు. ఆ అజ్ఞానాన్ని తాను భ్రమలతో, ఆశలతో పోషిస్తాడు.

తన మనస్సు తన భావాన్ని నిజానికి నమ్మలేదు. తనలో ఉండే ఒక అధికారవాంఛ ఆ భావాన్ని తయారుచేసి యితరుల్ని నమ్మమంది. తాను నమ్మినట్టుగా నమ్మించింది. తాను నమ్మినట్టుగా ఉండిపోవడంవల్ల ఒక్కొక్కసారి తనూ నమ్మేశాడు. అలా నమ్మకపోతే పదికోట్లమంది మహమ్మదీయులు తనవెనుకాల రారు. పదికోట్ల జెండాలమీద పదికోట్ల అర్ధచంద్రరేఖలు ఎగరవు. పదికోట్లమందియొక్క యిరవైకోట్ల కళ్ల యొక్క భక్తినీ, విశ్వాసాన్నీ, మార్ఖ్యాన్ని తాను చూరగొనలేదు. తనకే కాదు ఈ స్వార్థం; అందరికీ వుంటుంది. హిట్లర్, చర్చిల్, నెహ్రూ, గాంధీ—

అందరికీ వుంటుంది అనుకున్నాడు. గాంధీ, నెహ్రూ తనలాగే అద్దంలో చూసుకుంటారు. సంతృప్తిపడ తారు. తన స్వార్థం గొప్పది. తన స్వార్థం పవిత్రమైనది. తన స్వార్థం లేనిదే తాను ఏమీ కాడు. తాను ఏమీ కాకపోతే ముస్లింజగత్తు అంతా ఏమీ కాదు. అర్థంలేని దైపోతుంది.

జిన్నా కోటుగుండీలు పెట్టుకున్నాడు. పోర్టికోలోకి వచ్చాడు. జనం పాయలుగా విచ్చిపోయారు. జనం మిణుగురులులా ముడుచుకుపోయారు. నీటిమీద వేసిన తారాజువ్వలా జిన్నా ముందుకు వెళ్లాడు. కారులో ఎక్కాడు. వీథిలోకి వెళ్లాడు. పైన అనంతమైన ఆకాశం వుంది. కింద ఎక్కడికో పరచుకున్న భూమి ఉంది.

జిన్నా ఆకాశంఅంచుకీ, భూమిచివరకీ వ్యాపించాడు. జిన్నాలోని 'అధికారం' గాలిలో కలిసి, చెట్లల్లో పచ్చదనంగా, మబ్బులలోని నీలిమగా అయిపోయింది. దూరంగా వేలకొలది మహమ్మదీయులు తన కారుని చూసి చెయ్యెత్తి సలాముచేశారు. వాళ్ల కళ్లు తన్ని చూడగానే జిగాల్‌మని మెరిశాయి. వాళ్ల కళ్లు ప్రకాశించాయి. వాళ్ల కళ్లు ఎర్రబడ్డాయి. వాళ్లల్లోకి తన భావం విద్యుత్తుతో చేసిన కొరడాలాగ ఒక చరపు చరచింది. వాళ్లు పరిసరాల్నీ, నీతినీ, దేహాన్నీ సర్వాన్నీ మరచిపోయారు. వాళ్లు తన 'భావం' అయిపోయారు. వాళ్లు జలపాతంవంటి తన భావంతో మోదబడ్డారు. కల్లువంటి భావంతో నింపబడ్డారు. కత్తులూ, కర్రలూ పైకెత్తారు. జిన్నా కారు వీథిమలుపు తిరిగింది. తన వెనుకాల కోటిమనస్సులు మలుపుతిరిగాయి. దేశం యొక్క భవిష్యత్తు మలుపుతిరిగింది.

జిన్నా తన కారుమీద తిరిగివస్తున్నాడు. రోడ్లమీద రక్తం కనపడింది. రక్తంప్రక్కన శవాలు కనపడ్డాయి. గాజుగుడ్ల శవాలు - చేష్ట, వికృతి లేని శవాలు-కనపడ్డాయి. శవాలప్రక్కని తన భావం కనపడింది. జిన్నా ఉలిక్కిపడ్డాడు. తన 'భావం' ఉలిక్కిపడింది. జిన్నా కోటుగుండీలు సరిచేసుకున్నాడు. ఉలిక్కిపడిన జిన్నాలో రక్తం చల్లబడింది. రక్తం నల్లబడింది. ఎదురుగా రోడ్లమీద మానవుల రక్తం ఉంది. హిందువుల రక్తం, ముస్లిముల రక్తం వుంది. కలిసివుంది. ఆరక్తంలో రక్తకణాలు (Corpuscles) చచ్చిపోయాయి. ఆ రక్తంలో రక్తంయొక్క గుణం పోయింది. ఆ రక్తానికి ఏ జాతీ, నీతీ లేదు. ఏ భేదమూ లేదు. ఆ రక్తం మనిషికన్న గొప్పది. మనస్సుకన్న గొప్పది. ఆ రక్తం ఒక పెద్ద నిజం. ఆ రక్తం ప్రపంచమంతా మానవులకిందా, సింహాలకిందా, బల్లులకిందా, గొర్రెలకిందా, హిందువులకిందా, ముస్లిములకిందా అనేక రూపాలు ధరించింది. ఆరక్తం ఒక పరమసత్యాన్ని చాటుతోంది. ఆ రక్తం ఒక పెద్ద అమాయకత్వం. ఆ రక్తం ఒక పెద్ద కరుణ. ఆ రక్తం ఒక ఆర్తనాదం. ఆ రక్తం మానవుడి నీరసత్వాన్నీ, బుద్బుదత్వాన్నీ తెలుపుతోంది. ఆరక్తం మానవుడి పవిత్రతనీ, మానవుడి మానవత్వాన్నీ తెలుపుతుంది.

అనేకమందిరక్తం అది. అనేకమంది తమకి తెలియకుండానే చచ్చిపోయారు. చచ్చిపోతామనుకోకుండా చచ్చిపోయారు. చంపబడ్డారు. పిల్లలు, వృద్ధులు, తల్లులు, విరిగిన కాళ్లూ, పొడిచిన కళ్లూ, పేగులూ, మాంసం—అందరూ ఆరిపోయిన ప్రమిదలులా, ఆడుకుని పారేసిన మట్టిబొమ్మలులా వున్నారు. అందరూ అరుస్తూ చచ్చిపోయారు. చచ్చిపోయినా అరుపులు వినపడుతున్నాయి. ఆ అరపులు దిక్కుల్ని చీలుస్తున్నాయి. ఆ అరపులు గుండెల్ని చీలుస్తున్నాయి. ఆ అరపులు పోలీసుల్ని చీల్చడంలేదు.

జిన్నా కారు మలబార్ హిల్సువైపు వెళ్లసాగింది. కారువెనకనే అరుపులు వెంబడించాయి. కారును వెంబడిస్తూ రక్తం ప్రవహించింది. కారులో జిన్నా ఉన్నాడు. జిన్నా చాలా గొప్పవాడు. జిన్నా తన భావాన్ని వెంబడిస్తున్నాడు. డ్రైవరు అతివేగంగా కారు నడుపుతున్నాడు. జిన్నా చేతిలో న్యూస్ పేపరు వుంది. న్యూస్ పేపర్లో యిలా వుంది: 'కలకత్తాలో రెండువేలమంది మరణం'. న్యూస్ పేపరు కలకత్తా అయిపోయింది. న్యూసుపేపర్లో కలకత్తా వీథులూ, గల్లీలూ కనపడ్డాయి. పిచ్చిగా మత్తుగా రేగిన జుట్టుతో ఒకరినొకర్ని పొడుచుకుంటున్నారు. ఒక

భావంకోసం పొడుచుకుంటున్నారు. ఒక మాట కోసం పొడుచుకుంటున్నారు. ఒక మాటకోసం మాటలు మాటల్ని పొడుచుకోవు. ఒక మాటకోసం మనుష్యులు మనుష్యుల్ని పొడుచుకొంటున్నారు. మాటలు చచ్చిపోవు. మనుష్యులు చచ్చిపోతారు. మనిషి మాటని సృష్టించాడు. మాట మనిషిని బంధించింది.

కలకత్తా, లక్నో, అలహాబాద్, అహమ్మదాబాద్, బొంబాయి, పంజాబ్—ప్రతీనగరంలో, ప్రతీ వీథిలో, గల్లీలో తాను నిలుచున్నట్టూ, ఎవరినో పొడిచినట్టూ, ఎవరిచేతనో పొడవబడినట్టూ ఊహించుకున్నాడు జిన్నా. ఆతని క్రాపు రేగింది. అతని కోటు గుండీలు వదులయాయి. అతను దోషిలా బాధపడ్డాడు. మనిషిలా జాలిపడ్డాడు. సంఘంలా జలదరించాడు. విశ్వంలా విస్తుపోయాడు. తన భావంకోసం యింత ఘోరం జరిగింది. తనని లోకం అంతా చూస్తుంది. ప్రజలు అందరూ ప్రశ్నిస్తున్నారు. చరిత్ర తన కోటు గుండీలు విప్పి తన లోపలలోపల పరీక్షిస్తుంది! కొందరు తన్ని శిక్షించారు. తనిని ఖండఖండాలుగా చీల్చివేశారు. కొందరు తన్ని హేళనచేశారు. తన కోటు తనకి తిరగేసి తొడిగారు. కొందరు తన్ని పొగిడారు. పూలమాలలు వేశారు. 'అల్లాహో అక్బర్' అన్నారు.

వరండాముందు కారు ఆగింది. రాజకీయ వేత్తలూ, భక్తులూ, పత్రికావిలేఖరులూ స్తంభాల్ని ఆనుకున్న స్తంభాలులా వున్నారు. వాళ్ల కళ్లల్లో కంగారు వుంది. చీకాకు వుంది. ప్రశ్న వుంది. "నీ భావం మమ్మల్ని ఎక్కడికి తీసుకువెళ్లింది? తీసుకు వెళుతుంది? ఈ రక్తపాతానికీ, నీ భావానికీ సంబంధం ఏమిటి? అమాయికంగా, సుఖంగా వెళ్లే మా కుటుంబాలలో ఈ హఠాత్ మృత్యువూ, భయమూ ఎన్నాళ్లు భరించం?"—ఆ ప్రశ్న వాళ్లకళ్లల్లో పెద్ద మౌనంలా వుంది. ఆ మౌనం అగ్నిలా వుంది. ఆ మౌనం పెద్ద శబ్దంలా వుంది. చచ్చిన జీవుల మౌనం, వాళ్ల భార్యల మౌనం ఆ వరండాలో, పోర్టికోలో పేరుకుంది. ఆ మౌనం ఎలుగుబంటిలా కూర్చుంది. పులిలాగ పంజా చరచింది.

ఒక భావంతో తాను పదికోట్లమందిని ఒకటి చేశాడు. ఒక భావంతో తాను పదికోట్లమందిని ముప్ఫై కోట్ల జనంనుండి వేరుచేశాడు. అందరూ చేసేది యింతే! రాజకీయజ్ఞుల పని వేరుచెయ్యడం. ఒక జాతి అంటే తక్కిన మానవసంఘంతో వేరుపడిన ఒక సమూహం అన్నమాట. బాగా వేరుచేస్తే మరీ పెద్దనాయకుడవుతాడు. ఫాసిజం అని ఒక దేశం వేరుపడింది. మరొక 'యిజం' అని మరొక దేశం వేరుపడింది. మతం, నీతీ, విజ్ఞానం మనిషినీ మనిషినీ వేరుచేస్తున్నాయి. నక్షత్రాన్నీ, నక్షత్రాన్నీ వేరుచేస్తున్నాయి. పువ్వునీ, పువ్వురేకుల్నీ వేరుచేస్తున్నాయి. గుండెకీ గుండెకీ మధ్య ఒక అగాధం తను సృష్టించాడు. ఆ అగాధం తను యిప్పుడు పూడ్చలేడు, దాటలేడు—నిజానికి ఆ అగాధంలోనే తాను వున్నాడు.

జిన్నా అద్దంముందు నుంచున్నాడు. జిన్నా కోటుగుండీలు విప్పుకుంటున్నాడు. అద్దంలో మరొహ జిన్నా కనపడ్డాడు. అద్దంలో జిన్నా యిదివరకటి లాగే గొప్పవాడు. చాలా గొప్పవాడు. అద్దంలో జిన్నా అందరిలోనూ జిన్నా! కోటు విప్పుకుని చొక్కా విప్పుకున్నాడు. జిన్నా ఉలిక్కిపడ్డాడు. అద్దంలో జిన్నా గుండెమీద రక్తపుమరక కనపడింది. 'ఆయా'ని పిలిచాడు.

'నా గుండెమీద యీ రక్తం ఏమిటి?' అన్నాడు.

'నాకు ఏం కనపడటం లేదు.' అంది ఆయా!

కాని రక్తపుమరక వుంది—అక్కడ, ఆ గుండె దగ్గర. ఆయాకి కనపడలేదు; తనకి కనపడింది. అది నిజం. అది ఒక ఛాలెంజి! ఆ రక్తపుమరక అంది: 'నీ భావం అబద్ధం. నీ భావం అనవసరం.' తనే నిజం అంది. భావంకన్న, మనుష్యులకన్న, ప్రభుత్వాలకన్న తనే నిజం అంది. తనకోసమే యివన్నీ అంది. ఆ రక్తపు మరకని చూశాడు తిరిగి జిన్నా. కళ్లు మూసుకున్నాడు. అతని మనస్సుకి అతని మనస్సు కనపడింది. ఆ మనస్సులో ఒక పెద్ద విద్యుత్తు వుంది. అల్లిబిల్లిగా అల్లుకొన్న తీగలు వున్నాయి. చక్రాలు గిర్రున తిరుగు

తూన్న డైనమోవుంది. మనిషిలో వుండే 'అహం' అనే శక్తి అది. నాయకుడిలో వుండే 'అహం' అది. నరుడి పతనానికీ, ఔన్నత్యానికీ, పరిశ్రమకీ, పరిణామానికీ కారణభూతమైన మూలశక్తి అది! అలెగ్జాండరునీ, గజనీనీ, నాదిర్‌షానీ సముద్రాలూ, భూములూ, పర్వతాలూ దాటించిన స్వభావం అది. ఆ మనస్సులో ఉన్న పరమాణువుతో యిలా అన్నాడు: 'ఆ భావం నాకు వద్దు. ఆ భావం అనేకమందిని కలిపింది. తిరిగీ అనేకమందిని చంపింది. ఆ భావం అబద్ధం. కృత్రిమం. నిజమైనాకూడా నాకు వద్దు! నేను అందరితోనూ నిజం చెప్పేస్తాను. నాకు అలసట కలుగుతోంది. ఇంక నాకు శాంతి కావాలి.' ఆ పరమాణువు కోపగించింది. 'అహం' ఎదురుతిరిగింది. డైనమోచక్రాలు గిర్రున తిరిగాయి. తీగలు టకటక కదిలాయి. మనస్సు అంతా భరింపరాని కాంతితో నిండిపోయింది.

జిన్నా కళ్లు తెరిచాడు. ఒక అబద్ధాన్ని నిజం అని చెప్పి నమ్మించవచ్చును. తర్వాత ఆ అబద్ధం అబద్ధం అని చెప్పినా ఎవరూ నమ్మరు. ఇంక దారిలేదు. నాయకుడు నాయకుడిలాగే ఉండాలి. ఉండకపోతే నాయకుణ్ణి చంపేస్తారు. సాంఘికమైన ఒక మూర్ఖతని అతను పురికొల్పాడు. ఆ మూర్ఖతకి తాను చివరకి తల ఒగ్గాలి. నాయకుడు అజ్ఞానం అభివృద్ధిచెయ్యాలి. అజ్ఞానం బలమైనది. జ్ఞానం చురుకైనది.

పత్రికావిలేఖరులు కిటికీలోంచి సందేశం యిమ్మని ప్రార్థించారు. సంతృప్తి లేని ధీమాతో యిలా అన్నాడు: 'నా భావం నశించదు. నా భావాన్ని రథంలా పరుగెత్తించండి.' రథం పరుగెత్తింది. బెలూచిస్థాన్, పంజాబ్, బెంగాల్, అస్సాంభూములమీద రథం పరుగెత్తింది.

జిన్నా అద్దంలో చూసుకొన్నాడు. అద్దంలో జిన్నా చాలా గొప్పవాడు. తన వెనుకాల పదికోట్లమంది మహమ్మదీయులు ఉన్నారు. పదికోట్ల మంది మహమ్మదీయుల మనస్సులలో తన భావం విద్యుత్తులా మెరిసింది. వానలా కురిసింది. కొండ గుహలా ప్రతిధ్వనించింది. తాను ఒక ప్రాణి కాదు. ఒక చిత్రం కాదు. ఒక మనస్సు!

'అయా!' అన్నాడు జిన్నా.

'ఈ రక్తపు మరకని చెరిపెయ్యి!' అన్నాడు జిన్నా.

'అది చెరగదు ప్రభూ' అంది అయా!

జిన్నా ఉలిక్కిపడ్డాడు. 'చెరగదా'అని తిరిగి ప్రశ్నించాడు. తొందరగా కోటు తొడుక్కున్నాడు. కోటుగుండీలు పెట్టుకున్నాడు. అద్దంలో జిన్నా కనపడ్డాడు. అద్దంలో జిన్నా చాలా గొప్పవాడు. అంతకన్న గొప్పవాడు. తనవెనుక పదికోట్ల మహమ్మదీయుల.....!

